క్లుప్తంగా...

సన్మానం



రఘునాథ్ రాజ్‌ను అభినందిస్తున్న రవీందర్ తదితరులు

చార్మినార్: 6వ యూత్ స్టేట్ చాంపియన్‌షిప్-2023 బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సదానంద్ రఘునాథ్ రాజ్‌ను తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రవీందర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. షంషీర్‌గంజ్‌లోని హబీబ్ ముస్తాఫా బాక్సింగ్ అకాడమీలో కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తాఫా పర్యవేక్షణలో శిక్షణ పొందిన సదానంద్ రఘునాథ్ రాజ్ ఇటీవల జరిగిన 6వ యూత్ స్టేట్ చాంపియన్‌షిఫ్-2023 బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. జూన్‌లో సిక్కింలో నిర్వహించనున్న యూత్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్ షిఫ్-2023 పోటీల్లో రఘునాథ్ తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు కోచ్ ముస్తాఫా తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



పనులను ప్రారంభిస్తున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: ధోబీఘాట్‌లు, శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు జీహెచ్ఎంసీ నిధులు కేటాయించడం అభినందనీయమని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. నల్లవాగులోని ధోబీఘాట్‌లో రూ.7 లక్షల వ్యయంతో నిర్మించనున్న వెయిటింగ్ రూం పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లవాగు ధోబీఘాట్‌లో ఇప్పటికే కులవృత్తి నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వెయిటింగ్ రూం లేని కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రూ.7 లక్షలు మంజూరు చేశారన్నారు. నల్లవాగు శ్మశాన వాటిక ప్రహరీ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బాగేందర్ సింగ్, నర్సింగ్ రావు, మల్లేష్, సుకుమార్, వెంకటేష్, రాణా ప్రతాప్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు...



నాగ్‌నాథ్ మాశెట్టికి శుభాకాంక్షలు తెలుపుతున్న మల్లికార్జున్ దంపతులు

చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు నాగ్‌నాథ్ మాశెట్టి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పలువురు అధికార, అనధికార ప్రముఖులు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. నార్త్ ఈస్ట్ కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున్ జి తక్కల్ దంపతులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి మెమోంటో అందజేశారు.

కార్మిక హక్కుల సాధనే ధ్యేయం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు వెంకటయ్య

రాజేంద్రనగర్: కార్మిక హక్కుల సాధనకు సీఐటీయూ నిరంతర పోరాటాలు చేస్తుందని రాజేంద్రనగర్ మండల సీఐటీయూ నాయకుడు వెంకటయ్య అన్నారు. శాస్త్రిపురం వట్టిపల్లి లేబర్ అడ్డా నూతన కమిటీ ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ మండల సీఐటీయూ కన్వీనర్ రుద్రకుమార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అన్ని అడ్డాల్లో కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ ముందుండి పోరాడుతుందని ఎలాంటి ఇబ్బందులున్నా... తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ తదితర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కార్యవర్గం..

వట్టిపల్లి లేబర్ అడ్డా నూతన కమిటీ అధ్యక్షులుగా రహీం, కార్యదర్శిగా చాంద్ పాషా, సహాయ కార్యదర్శిగా అక్రం, కోశాధికారిగా సమి, సహాయ కార్యదర్శిగా షమీమ్ బాబు, ఉపాధ్యక్షులుగా బాబురావు, కార్యనిర్వాహకులుగా ఇస్మాయిల్, రాజు, లక్ష్మీ, కిశోర్ ఎన్నికయ్యారు.

కొత్త ఠాణాల్లో అత్యాధునిక సౌకర్యాలు

గోల్కొండ: నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్లలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించినట్లు రాష్ట్ర హోం మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. సోమవారం ఆయన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్‌లకు కొత్త భవనాలు నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే అన్ని పోలీస్ స్టేషన్లకు నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణ పోలీసుల పనితీరు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉందన్నారు. నేరస్తులు ఎంతటి వారైనా పోలీసుల నుంచి తప్పించుకోలేరన్నారు. ఫిర్యాదుల కోసం ఠాణాకు వచ్చే వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, బాధితులకు సత్వర న్యాయం అందించడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రవేశపెట్టిన ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. సైబర్ నేరగాళ్ల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



హుమాయున్‌నగర్ ఠాణాను ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, తలసాని తదితరులు

కార్యక్రమంలో కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మొహియుద్దీన్, జాఫర్ హుసేన్ మేరాజ్, రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్ బాబు, డిసిపిలు కిరణ్ ఖరే, జోయల్, కార్పొరేటర్ నసీరుద్దీన్, ఏసీపీ శివమారుతి, బీఆర్ఎస్ కార్వాన్ ఇన్‌చార్జ్ టి. జీవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

గన్‌ఫౌండ్రీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ శాసనమండలి సభ్యులు చంద్రగిరి యేసురత్నం అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో వడ్డెర, వడియరాజుల సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... వడ్డెర కులస్తులు రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. ఈ సమాజిక వర్గానికి చట్ట సభల్లో సరైన అవకాశాలు దక్కడం లేదని, ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ వడ్డెర కులస్తులను రాజకీయంగా ప్రోత్సహించాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన తనకు రాజకీయాల్లో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కృష్ణయ్య, వేమూరి వెంకటేష్, అంజన్‌బాబు, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ యేసురత్నంను సన్మానిస్తున్న వడ్డెర సంఘాల నాయకులు

ఘన సన్మానం

వైఎస్సార్ సీపీ శాసనమండలి సభ్యులు చంద్రగిరి యేసురత్నంను సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వడ్డేర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు వేముల వెంకటేష్, బత్తుల లక్ష్మీకాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి

చాంద్రాయణగుట్ట: అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించకుంటే తామే వాటిని పంపిణీ చేస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.డి.అబ్బాస్ అన్నారు. సీపీఎం గౌస్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇళ్లు లేని పేదల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గౌస్‌నగర్‌లోని ఇళ్లు లేని పేదలు డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు ఇప్పటికే శిథిలమవుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే అర్హులను గుర్తించి వాటిని పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి కిషన్ నాయక్, కోటిరెడ్డి, జీవన్, ఫర్హానా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్బాస్

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'

గోల్కొండ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. అమర్ సింగ్ అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి పాలనపై ప్రజలు విసుగెత్తారన్నారు. స్వయంగా రాష్ట్ర మంత్రులే అవినీతికి పాల్పడుతూ ప్రజాధనాన్ని లూటీ చేసుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి కుమార్తె మద్యం స్కాంలో విచారణ ఎదుర్కొంటున్న విషయం ప్రజలకు తెలుసన్నారు, ప్రజలు బీజేపీ వెంటే ఉన్నారన్న విషయం ప్రజాసంగ్రామ యాత్రలో తేటతెల్లమైందన్నారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు, వారి తల్లిదండ్రులు

గోల్కొండ: జనహిత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం చేపట్టిన సేవా కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో బీఎంఎల్ ట్రస్ట్ సహకారంతో నిర్వహిస్తున్న చిన్నారుల శిక్షణ శిబిరంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న చిన్నారులకు బహుమతులు అందించి, వారి తల్లులను సన్మానించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని బీజేపీ నాయకులు దేవర వంశీ అన్నారు. సోమవారం ఆయన రూ. 6.5 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనిల్, మహేష్, పటేల్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

రాజ్యాంగ ప్రతులను పంపిణీ చేయాలి

గన్‌ఫౌండ్రీ: భారత రాజ్యాంగంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా ప్రతినిధులు అన్నారు. ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ ప్రతులను ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతూ..... పార్టీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగంపై నేటికీ అనేకమందికి అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగంపై అవగాహన కల్పించే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.



హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ధర్మసమాజ్ ప్రతినిధులు

కార్యక్రమంలో కార్తిక్ మహారాజ్, లింగస్వామి మహారాజ్, గోల్కొండ కృష్ణ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులతో ఆగిన బస్సులు

గోల్కొండ: చాలా కాలంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులు ప్రజలకు శాపంగా మారాయి. పనుల కోసం రోడ్లను తవ్వడంతో పలు ప్రాంతాలకు సిటీ బస్సులు రద్దయ్యాయి. మెహిదీపట్నం, సికింద్రాబాద్ అఫ్జల్‌గంజ్ నుంచి మెహిదీపట్నం, ఫ్లోర్‌మిల్ మీదుగా గోల్కొండకు వచ్చే బస్సులు తవ్వకాల కారణంగా ఆగిపోయాయి. ఎండీ లైన్స్ నుంచి మోతీ దర్వాజ వరకు గత కొంత కాలంగా వరదనీటి పైప్ లైన్ పనులు జరుగుతుండటంతో ఈ దారిలో వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పనులు వేగవంతం చేసి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించాలి

సుల్తాన్‌బజార్: పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ముందుకురావాలని భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. సోమవారం గోషామహల్‌లో డాక్టర్ రమణ ఉచిత క్లినిక్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... పేదల కాలనీల్లో ఉచిత క్లినిక్‌లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి క్లినిక్‌ల ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. వైద్యులు తమ ప్రాక్టీస్ చేసుకుంటూనే నిరుపేదలకు ఉచిత వైద్యాన్ని అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో భజరంగ్‌సేనా ప్రధాన కార్యదర్శి సూర్య శుక్లా, రామ్‌ప్రకాష్, రాజారామ్, ఆనంద్, సురేష్, విజయ్ పాటిల్, ప్రవీణ్ ఠాకూర్, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎస్.ఆర్.లక్ష్మణ్‌రావు, డాక్టర్ రమణ తదితరులు

ఏరియా ఆసుపత్రిలో పురాతన శివలింగం

నాంపల్లి: ఏరియా ఆసుపత్రిలో ఓ పురాతనమైన శివలింగం వెలుగులోకి వచ్చింది. ఈ శివలింగం కాకతీయ రాజుల కాలానికి చెందినదై ఉండవచ్చునని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలియడంతో స్థానికులు అక్కడికి వచ్చి పూజలు చేస్తున్నారు. ఆసుపత్రి ప్రాంగణంలోని టూ వీలర్ పార్కింగ్ (టీబీ ఆసుపత్రి ఎదురుగా) వద్ద ఉన్న శివలింగం దగ్గరకు ఎవరూ వెళ్లకుండా సిబ్బంది మంచాలను కంచెగా వేశారు. ఈ శివలింగంపై ప్రాచీన లిపికి చెందిన అక్షరాలు, శివలింగం చుట్టూ నంది విగ్రహాలు ఉన్నాయి. పురావస్తు శాఖ అధికారులు సందర్శిస్తే ఏ కాలానికి చెందినదో తెలుసుకునే అవకాశం ఉందని స్థానికులు పేర్కొన్నారు.



జీవన్‌ధార మెడికల్ షాప్ ప్రారంభం



జనరిక్ మెడికల్ షాప్‌ను ప్రారంభిస్తున్న ఫలక్‌నుమా డీఎం జాకీర్ హుస్సేన్ తదితరులు

అఫ్జల్‌గంజ్: నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే అఫ్జల్‌గంజ్ బస్ స్టేషన్‌లో నూతనంగా జీవన్‌ధార ఫార్మసీ జనరిక్ మెడికల్ షాప్‌ను ప్రారంభించారు. తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మందుల దుకాణాన్ని సోమవారం టీఎస్ ఆర్టీసీ ఫలక్‌నుమా డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు పి రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి మాట్లాడుతూ... పేద ప్రజలకు తక్కువ ధరకే జనరిక్ మందులు అందించాలని మందుల షాపును ఏర్పాటు చేశామన్నారు. గత 15 ఏళ్లుగా ఉస్మానియా ఆస్పత్రిలో జనరిక్ మందుల దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లాభాపేక్ష లేకుండా నాణ్యమైన మందులను అత్యంత తక్కువ ధరకే అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇంటర్‌లో శ్రీమేధావి జయకేతనం

గోల్కొండ: ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం ఫలితాల్లో మెహిదీపట్నం శ్రీమేధావి జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. కళాశాల టాపర్స్‌ను సోమవారం కళాశాలలో వారి తల్లిదండ్రుల సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ పూర్ణ, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏటా తమ విద్యార్థులు ఇంటర్‌లో సత్తా చాటుతున్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో సీఈసీ విద్యార్థి జి. ప్రణీత్ 500 మార్కులకు గాను 490 మార్కులు సాధించగా, 2వ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థిని జి. నాగశ్రీ 1000కి గాను 979 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. సీనియర్ అధ్యాపకుల కృషితో పాటు తాము అవలంబిస్తున్న బోధన పద్ధతుల వల్లే విద్యార్థులు సత్తాచాటుతున్నారని వారు పేర్కొన్నారు.



కళాశాల టాపర్స్‌తో డైరెక్టర్ పూర్ణ, ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య తదితరులు

సేవాతత్వాన్ని అలవర్చుకోవాలి

సుల్తాన్‌బజార్: ప్రతి ఒక్కరూ సేవాతత్వాన్ని అలవర్చుకోవాలని వల్లూరి ఫౌండేషన్ ఛైర్మన్ వల్లూరి శ్రీనివాస్ రాజ్ అన్నారు. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో నేషనల్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి పుష్పలీల, ఏసీపీ రామ్‌దాస్ శ్రీ లక్ష్మీనివాస్ ఇన్ఫ్రా డెవలపర్స్ డైరెక్టర్ గద్దె మధుకర్ గౌడ్‌కు నేషనల్ బెస్ట్ సోషల్ సర్వీస్ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినిమా ఆర్టిస్టులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



మధుకర్‌గౌడ్‌కు అవార్డు అందజేస్తున్న దృశ్యం

మురుగు..పరుగు

అటెన్షన్ ప్లీజ్..

నాంపల్లి: విజయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవన సముదాయం ఎదురుగా మ్యాన్ హోల్ పొంగి పొర్లుతోంది. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై మురుగునీరు పారుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలలో కనీసం రెండు మూడు పర్యాయాలు ఇక్కడ మ్యాన్ హోల్ పొంగుతోందని, సమస్యపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. హోటల్స్ నుంచి వెలువడే వ్యర్థాలు పేరుకుపోతుండటమే ఇందుకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



ఫోన్‌లో భార్యకు తలాక్ చెప్పిన వ్యక్తిపై కేసు నమోదు

చాంద్రాయణగుట్ట: మొదటి భార్యకు తెలియకుండా మరో మహిళను పెళ్లి చేసుకోవడమే కాకుండా ఇదేంటని నిలదీసినందుకు మొదటి భార్యకు ఫోన్‌లోనే ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నూరీనగర్‌కు చెందిన ఇష్రత్ పర్వీన్‌కు ఫజ్లే రహ్మా రహమానీతో 2016 జూలై 17న బిహార్‌లో వివాహం జరిగింది. ఆ తర్వాత ఫజ్లే రహ్మా రహమానీ రహస్యంగా మరో యువతిని వివాహమాడాడు. ఈ విషయం మొదటి భార్య ఇష్రత్‌కు ఫిబ్రవరిలో తెలిసింది. ఈ విషయమై ఫోన్‌లో అడగగా అసభ్యకరమైన మాటలు మాట్లాడడంతో పాటు నువ్వు అవసరం లేదంటూ తలాక్...తలాక్...తలాక్ అని చెప్పాడు. గత నెల 17న ఈ విషయమై కేసు నమోదు చేయగా..సోమవారం మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ తెలిపారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. షాపింగ్ మాల్స్, రెస్టారెంట్ల ముందు రోడ్ల పైనే కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షేక్‌పేట్ డి-మార్ట్ ఎదురుగా ఉన్న రోడ్డు పై వాహనాలు అడ్డదిడ్డంగా పార్క్ చేసి ఉంటున్నాయి. కొత్తగా వేసిన డివైడర్ పై కూడా దర్జాగా వాహనాలు పార్క్ చేస్తున్నారు. టోలిచౌకీ అర్బా హోటల్, టూంబ్స్ చౌరాస్తా సమీపంలోని జీషాన్ హోటల్ ఎదుట పెద్ద సంఖ్యలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. పశ్చిమ మండలం ఆర్టీఏ కార్యాలయంలో సమీపంలోని షాగౌస్ హోటల్ ముందు సైతం రోడ్లపై కార్లు, ద్విచక్ర వాహనాల నిలపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.



షేక్‌పేట్ డీ-మార్ట్ ఎదుట రోడ్డుపై అక్రమ పార్కింగ్

వైభవంగా పోచమ్మ దేవాలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని పోచమ్మ దేవాలయం పదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంతగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకంతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలు, పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వనం శ్రీరాం రెడ్డి, రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్ రావు, సురేందర్ రెడ్డి, చిన్న, శ్రీధర్ రెడ్డి, కొమరయ్య, మధుసూదన్, సామా ఇంద్రపాల్ రెడ్డి, సులిగే విజయ్, మల్లా రెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో విఫలం

కాచిగూడ: దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో బీజేపీ పూర్తిగా విఫలమైందని దేశ వ్యాప్తంగా బీజేపీని ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఆమె పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు.

ప్రతిభావంతులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న 'సెట్విన్' ఎండీ కె.వేణుగోపాల్ రావు

యాకుత్‌పురా: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చది వి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సెట్విన్ శిక్షణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు అన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన సెట్విన్ ఉద్యోగుల పిల్లలను సోమవారం కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రతీక్ కుమార్, గణేష్ కుమార్, సౌమ్య, మహెర జబీన్, వెంకట రామన్, నహీద్ ఫాతిమా, టి.భానుప్రకాశ్‌లను సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వేణుగోపాల్ రావు మాట్లాడుతూ... ప్రతిభావంతులను సత్కరిస్తే వారికి మరింత ప్రోత్సాహం అందించినట్లవుతుందని అన్నారు. ఇంటర్ విద్యార్థిని సౌమ్య ఉన్నత విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును తానే భరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ ఓంప్రకాశ్, మేనేజర్ ఎం.ఎ.మోహిజ్, టీ స్టెప్ మేనేజర్ జె.జగన్నాథం, సెట్విన్ సూపరింటెండెంట్ పీబీఎస్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.